
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

5 నంద్యాల

జిల్లా వార్తలు

శనివారం 6 ఏప్రిల్ 2024





రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శనివారం 6:26(సాయంత్రం)

సెహరీ : ఆదివారం 4:46 (ఉదయం)

కొద్ది రోజులు ఓపిక పట్టండి

రాక్షస పాలనను అంతం చేస్తాం

'నిజం గెలవాలి' సభలో నారా భువనేశ్వరి



మహనందిలో నారా భువనేశ్వరిని చూసేందుకు వచ్చిన మహిళలు



నంద్యాలలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

మహానంది, ఏప్రిల్ 5: మరి కొద్ది రోజులు ఓపిక పడితే రాక్షస పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి లభిస్తుందని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నంద్యాల జిల్లా మహానంది మండలం బుక్కాపురంలో పర్యటించారు. చంద్రబాబు అక్రమంగా అరెస్టను తట్టుకోలేక మృతి చెందిన చిన్న మద్దిలేటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ అండంగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం బుక్కాపురం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. సంక్షేమం పేరుతో సీఎం జగన్ రాష్ట్రాన్ని దివాళా తీయించారని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో గంజాయి, కల్తీ మద్యం, ఇసుక అక్రమ రవాణాతో రూ.కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఎంతో మంది టీడీపీ కార్యకర్తలను దారుణంగా హత్య చేయించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని అంతం మొందించి, టీడీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, టీడీపీ నాయకుడు తాతిరెడ్డి తులసిరెడ్డి, మాజీ ఎంపీపీ చింతం నాగమణి, టీడీపీ నాయకులు కంచెర్ల సత్యనారాయణ చౌదరి, కంచెర్ల శివ, గడ్డం నాగపుల్లయ్య, సుబ్రహ్మణ్యం, మౌళీశ్వరరెడ్డి, కాకర్ల శివ, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, గని, చిన్నరంగస్వామి పాల్గొన్నారు.

కార్యకర్తల త్యాగాలు మరువలేనివి

నంద్యాల (నూనెపల్లె): తెలుగుదేశం పార్టీ కార్యకర్తల త్యాగాలు మరువలేనివి అని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుతో గుండెపోటుకు గురై మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకు నిజం గెలవాలి కార్యక్రమం ద్వారా ఆమె శుక్రవారం నంద్యాలలో పర్యటించారు. 34వ వార్డు వెంకటాచలం కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త గాజుల అబ్దుల్ రహీమ్ కుటుంబాన్ని పరామర్శించారు. అంతకముందు 34వ వార్డు సీనియర్ నాయకుడు సూరి సమక్షంలో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఎవి సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎవిఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ తదితరులు ఆమె వెంట ఉన్నారు. అబ్దుల్ రహీమ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకొని వారిలో ధైర్యాన్ని నింపారు. అలాగే 13వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త గురువరాజు కుటుంబాన్ని పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బండిఆత్మకూరు: నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామంలో కందుకూరి నరసింహాచారి, కసినేని వెంకటేశ్వర్లు గౌడ్ కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బైరెడ్డి శబరి, నాయకులు సురేష్ రెడ్డి, మనోహర్ చౌదరి, బుగ్గరాముడు, శంకర్, రామచంద్ర, లింగారెడ్డి తదితరులు ఉన్నారు.



నారాయణపురంలో మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న నారా భువనేశ్వరి



బుక్కాపురంలో చిన్నమద్దిలేటి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న నారా భువనేశ్వరి



నంద్యాలలో అబ్దుల్ రహీం కుటుంబ సభ్యులతో భువనేశ్వరి



గురువరాజు కుటుంబాన్ని ఓదార్చుతున్న భువనేశ్వరి



నారాయణపురంలో కందుకూరి నరసింహాచారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

పోలీసుల విస్తృత తనిఖీలు

నిబంధనల ఉల్లంఘనలో ఇద్దరిపై కేసు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. సరిహద్దు చెక్‌పోస్టులలోని సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మద్యం, నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడమే ధ్యేయంగా శ్రమిస్తున్నారు. అలాగే ప్రధాన రహదార్లపై డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ, ఇతర జిల్లాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని శుక్రవారం ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి ప్రజలకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నాటుసారా, మద్యం అక్రమంగా తరలిస్తున్న వారు, విక్రయిస్తున్న వారిని గుర్తించి 10 కేసులు నమోదు చేసి 21 మందిని అరెస్టు చేసి 270 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే 155 (180ఎంఎల్) మద్యం బాటిళ్లను సీజ్ చేసి, సుమారు 4200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. డోన్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట స్థావరాలపై దాడిచేసి ముగ్గురిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.16,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై రూ.19,600 జరిమానా విధించినట్లు, మద్యం తాగి వాహనాలు నడిపిన 11మందిపై కేసులు నమోదు చేసి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా 119మందిని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన రెండు కేసులు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నల్లమలలో ప్లాస్టిక్ కనిపించకూడదు

పీఎఫ్ఎఫ్‌డీ బీఎస్ఎన్ మూర్తి



అధికారులకు సూచనలు ఇస్తున్న కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఫీల్డ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాజెక్టు టైగర్ బీఎస్ఎన్ మూర్తి

రుద్రవరం, ఏప్రిల్ 5 : నల్లమలలో ప్లాస్టిక్ అనేదే కనిపించకూడదని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ఫీల్డ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాజెక్టు టైగర్ బీఎస్ఎన్ మూర్తి అన్నారు. శుక్రవారం నంద్యాల జిల్లాలోని రుద్రవరం సబ్ డివిజను పరిధిలో చెలిమ, రుద్రవరం రేంజ్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెలిమ రేంజ్‌లో రెండు పెద్దపులుల, రుద్రవరంలో ఒక పెద్దపులి పాదముద్రల గుర్తించామన్నారు. వన్యప్రాణుల నీటి ఆవాసాలైన బావులు, ఏర్లు, తుళ్లవాగు రిజర్వాయరు, చెరువులను పరిశీలించామని తెలిపారు. పెద్దపులులు, వన్యప్రాణులకు హానీ కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధిద్దామని కోరారు. దేవాలయాల సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడి ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఇకపై కనిపించకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో నంద్యాల డిప్యూటీ డైరెక్టరు వైల్డ్‌లైఫ్ విభాగం అధికారి అనురాగ్‌మీనా, రేంజర్లు శ్రీపతినాయుడు, ఈశ్వరయ్య, డిప్యూటీ రేంజర్లు ముర్తుజావలి, నాగేంద్రనాయక్, సెక్షన్ ఆఫీసర్లు మక్తర్‌బాషా, శ్రీనివాసులు, నాగరాజు, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

'గొప్ప సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్'



బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 5: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జగ్జీవన్ రామ్ 117వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భాన్ని ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలవేసి నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆయన నడిచిన బాట, చూపిన సంస్కరణలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి దిలీప్ బాషా తదితరులు పాల్గొన్నారు.

భ్రామరికి పుట్టింటి సారె

- ఆడపడుచు వాయన సమర్పణకు కన్నడిగుల పాదయాత్ర
- శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారం
- మండుటెండలను లెక్కచేయని భక్తిపారవశ్యం
- వందల కి.మీ. దూరం నుంచి రోజుల తరబడి ప్రయాణం

ఆత్మకూరు, ఏప్రిల్ 5: కర్ణాటక రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి శ్రీశైల భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు మండుటెండలను సైతం లెక్కచేయకుండా మల్లన్న సన్నిధికి చేరుకుంటున్నారు. శ్రీశైలంలో ప్రతిఏటా జరిగే ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని పాల్గుణ మాసంలో కన్నడిగులు శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వస్తారు. ప్రత్యేకించి శ్రీశైలేషుని ధర్మపత్ని భ్రమరాంబిక అమ్మవారిని కన్నడిగులు సాక్ష్యాత్తు తమ ఆడపడుచుగా భావించి పుట్టింటి సారెను (పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు, వడిబియ్యం) సమర్పించేందుకు శతాబ్దాల కాలం నుంచి కాలినడకన అమ్మవారి సన్నిధిగా చేరుకుంటున్నారు. ఉగాది పర్వదినాన్ని ముందే కన్నడిగులు శ్రీశైలానికి అమ్మవారికి పుట్టింటి సారే సమర్పించి తమ భక్తిపారవశ్యాన్ని చాటుకుంటున్నారు. అలాగే భ్రామరీ అమ్మవారికి మిరియాల చూర్ణాన్ని (మిరియాలపట్టు) కూడా నుదుటన ఉంచేందుకు తీసుకొస్తారు. శ్రీశైలంలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో క్షేత్రానికి లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. ఆ సమయంలో భక్తుల రద్దీతో అమ్మవారికి తలపోటు వచ్చిందేమోనన్న భావనతో ఆ కష్టాన్ని తొలగించాలన్న ఉద్దేశంతో మిరియాల పట్టును తీసుకు రావడం సంప్రదాయంగా వస్తోంది. ఎంతో విశేష ప్రాశస్త్యం కలిగిన కన్నడిగుల పాదయాత్ర శ్రీశైల క్షేత్ర ఆవిర్భావం నుంచే కొనసాగుతున్నట్లు పురాణాలు చెబుతున్నాయి.



కర్ణాటక రాష్ట్రం నుంచి రథాన్ని లాగుతూ వస్తున్న యువకులు

ఆత్మకూరులో కన్నడిగుల సందడి

ఉగాది పర్వదినం సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైల క్షేత్రానికి వెళ్లే కన్నడిగులు కచ్చితంగా ఆత్మకూరుకు వస్తారు. వీరి రాకతో ఆత్మకూరు పట్టణంలో సందడి వాతావరణం ఉంటుంది. వేలాదిగా తరలివస్తూ స్వామిఅమ్మవార్లకు కావిడి తీసుకెళ్తూ రహదారి పొడవునా కన్నడిగులే కనిపిస్తుంటారు. వివిధ దుకాణాల్లో కూడా కన్నడిగుల సందడి ఉంటుంది. ప్రత్యేకించి తిరుగు ప్రయాణంలో కన్నడిగులు ఆత్మకూరులో వెదురుతో తయారు చేసిన చాటలు అధికంగా కొనుగోలు చేస్తారు. అలాగే వెదురు పట్టుడు కర్రలను కూడా ఇక్కడి నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్తారు.



నల్లమల అటవీ ప్రాంతంలో వేలాదిగా వస్తున్న భక్తులు

పాదయాత్ర సాగుతుందిలా..

సుదూర ప్రాంతాల నుంచి కాలినడన ఆత్మకూరుకు వచ్చే కన్నడిగులు అక్కడి నుంచి పాదయాత్ర ద్వారానే వెంకటాపురం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ వీలైతే కాసింత సమయం సేదతీరి పంట పొలాల మార్గం గుండా అటవీ మార్గంలో ప్రవేశించి బైర్లూటి వీరాంజనేయ స్వామి ఆలయాన్ని దర్శిస్తారు. ఆ తర్వాత వారు బైర్లూటి మీదుగా నాగలూటి వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నాగలూటి తిప్పలుపై నడుస్తూ దాదాపు 16 కిమీల దూరంలో ఉన్న పెచ్చెర్వు చెంచుగిరిజన గూడేనికి చేరుకుంటారు. ఈ ప్రాంతాల చాలా వరకు భక్తులు కొంత సమయం పాటు సేదతీరుతారు. అక్కడి నుంచి తిప్పలు, అటవీ మార్గం గుండా సుమారు 18 కి.మీ.లు నడిచి భీమునికొలను ప్రాంతానికి చేరుతారు. అక్కడి నుంచి మరో 5 కిమీల దూరంలో హటకేశ్వరం, ఆ తర్వాత 6 కిమీల దూరంలో శ్రీశైల మహాక్షేత్రానికి చేరుకుంటారు.

కాలినడకన ఎనిమిది సార్లు వచ్చాను



మాది కర్ణాటక రాష్ట్రంలోని బెల్గామ్ జిల్లా, అత్ని తాలుకా, అరవకోడి గ్రామం. 11 రోజుల క్రితం పాదయాత్ర ప్రారంభించి సుమారు 750 కి.మీ.ల దూరం నుంచి నడిచి ఆత్మకూరుకు చేరుకున్నాం. ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల క్షేత్రానికి 8 సార్లు పాదయాత్రగా వచ్చాను. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లపై తమకు ఉన్న భక్తి భావమే మమ్మల్ని శ్రీశైలానికి చేరవేస్తోంది. మల్లన్నే మాకు ఏకష్టం రానివ్వకుండా యాత్రను పూర్తి చేస్తాడని మా నమ్మకం.

- లఖవ తీర్థ, అవరకోడ గ్రామం, బెల్గాం జిల్లా

మల్లన్నపై ఉన్న భక్తే మమ్మల్ని ఇంత దూరం వచ్చేలా చేస్తోంది



శ్రీశైల మల్లన్నపై మాకున్న భక్తే మమ్మల్ని ఇంత దూరం నడిపిస్తోంది. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటి వరకు ఐదు సార్లు శ్రీశైలానికి కాలినడకన వచ్చాను. మల్లన్న దయతో నాకు శక్తి ఉన్నంత వరకు శ్రీశైలానికి రావాలని భావిస్తున్నాను. ఇలా పాదయాత్రగా వెళ్లడం వల్ల మా కుటుంబానికి, గ్రామానికి మంచి జరుగుతుందని మాచేందుకు వందలాది కిమీల నుంచి పాదయాద్ర తరలివస్తున్నారు. మా గ్రామం నుంచి ఎంతో మంది భ్రమరాంబ అమ్మవారికి వాయనం సమర్పించేందుకు శ్రీశైలానికి కాలినడకన తరలి వస్తున్నారు.

- నవీన్‌చంద్ బబలాదీ, అవరకోడ గ్రామం, బెల్లాం జిల్లా



దాదాపు ఐదువందల కిలోమీటర్ల నుంచి ఇలాగే నడక..





పాదయాత్రగా వస్తున్న యాత్రికులు



ఫొటోలో కనిపిస్తున్న ఈ రైతు పేరు కే మహేష్, గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామం. 2021 ఖరీఫ్ సీజన్‌లో తనకున్న ఐదెకరాల పొలంలో పత్తి సాగు చేశాడు. కొత్త బస్టాండు సమీపంలో ఓ దుకాణంలో డీలరు వద్ద కావేరి కంపెనీకి చెందిన జాదూ రకం పత్తి విత్తనాలను కొనుగోలు చేశాడు. పత్తి సాగు కోసం దాదాపు రూ.లక్షకు పైగా ఖర్చు చేశాడు. పంట చేతికందే సమయంలో పత్తి కాయలు పూర్తిగా రాలిపోయాయి. పక్వానికి వచ్చిన కాయలు కూడా నేలపై రాలిపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నారు. పంటను వ్యవసాయాధికారులకు చూపించాడు. వ్యవసాయాధికారి శాంపుల్స్‌ను తీసుకుని ప్రయోగశాలకు పంపాడు. ఈ రైతు మాదిరిగానే దాదాపు ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు వేల మంది రైతులు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కావేరి కంపెనీకి చెందిన జాదూ రకం విత్తనాలనే వాడారు. పంట దిగుబడి ఏ మాత్రం లేకపోవడంతో రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని రైతులంతా ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున ఆందోళనలకు దిగారు. దీంతో ప్రభుత్వ ఆదేశాలపై కర్నూలు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, అదేవిధంగా నంద్యాల వ్యవసాయ శాఖ జేడీ మోహన్‌రావు నివేదికల ఆధారంగా నంద్యాల, వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని శాస్త్రవేత్తలు గూడూరు, కల్లూరు తదితర మండలాల్లో పత్తి పంటను పరిశీలించి నాసిరకం విత్తనాల వల్లే దిగుబడి తగ్గిపోయినట్లు నిర్ధారించారు. అదేవిధంగా గుంటూరులోని లాంఫాం పరిశోధన కేంద్రానికి చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించి పత్తి పొలాలను పరిశీలించి శాంపుల్స్ తీసుకువెళ్లి ప్రయోగశాలల్లో పరిశీలించారు. వారి పరిశీలనలో నాసిరకం విత్తనాలు వినియోగించడం వల్లనే పంట దెబ్బతిందని నిర్ధారించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, కర్నూలు, పాణ్యం, నందికొట్కూరు తదితర నియోజకవర్గాల్లోని దాదాపు పది వేల మంది రైతులకు పైగానే కావేరి కంపెనీకి చెందిన జాదూ రకం పత్తి విత్తనాలను వాడారు. అయితే.. అధికారుల ప్రభుత్వానికి పంపిన నివేదిక ప్రకారం రైతుల నుంచి సేకరించిన రశీదులను పరిశీలించి 1800 మంది రైతులు మాత్రమే తొమ్మిది వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారని పేర్కొన్నారు. శాస్త్రవేత్తల నివేదికను అనుసరించి 2021లోనే కర్నూలు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు వ్యవసాయ శాఖ చెందిన వివిధ నియోజకవర్గాల జేడీలు రైతులను పిలిపించుకుని ఎంత మొత్తంలో పరిహారం అందించాలో చర్చించారు. ఎకరాకు మూడు క్వింటాళ్ల దిగుబడిని ప్రాతిపదికగా తీసుకుని 13 వేలకు పరిహారాన్ని అందించేలా నిర్ణయించారు 1800 మంది రైతులకు సంబంధించి ఎనిమిది వేల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతినడం వల్ల సంబంధిత పొలాల రైతులకు రూ.17 కోట్లు చెల్లించాలని కావేరి కంపెనీ యాజమాన్యానికి అధికారుల కమిటీ ఉత్తర్వులను జారీ చేసింది. అయితే..

2021 ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లా రైతులు సాగు చేసిన పత్తి పంట విస్తీర్ణం (హెక్టార్లలో)

సబ్ డివిజన్	విస్తీర్ణం
కర్నూలు	33,845
డోన్	14,445
నందికొట్కూరు	10,931
ఆత్మకూరు	2,373
నంద్యాల	3,318
ఆళ్లగడ్డ	983
కోయలకుంట్ల	1,764
ఆదోని	62,346
ఎమ్మిగనూరు	50,224
ఆలూరు	49,053
పత్తికొండ	21,091

కమిషనర్‌దే తుది నిర్ణయం



2021 ఖరీఫ్‌లో పత్తి పంట నష్టపోయిన రైతులకు దాదాపు రూ.17 కోట్లు పరిహారం అందించాల్సి ఉంది. తుది నిర్ణయం వ్యవసాయ శాఖ కమిషనర్ తీసుకోవాల్సి ఉంది. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈ విషయంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు పరిహారాన్ని అందిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు..

- వరలక్ష్మి, జేడీఏ



ఇది జాదూ ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 5:

రైతులను నట్టేట ముంచిన 'జాదూ' పత్తి రకం విత్తన కంపెనీకే ప్రభుత్వం వత్తాసు పలుకుతోంది. 2021లో పత్తి రైతులకు తీవ్రంగా నష్టపోయినా పరిహారం ఇప్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 1800 మంది రైతులు మాత్రమే తొమ్మిది వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. అయితే వీరంతా జాదూ రకం కంపెనీ విత్తనాలనే వాడారు. ఇవి నాసిరకం కావడంతో దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారు. దీంతో రైతులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో స్పందించిన ప్రభుత్వం అధికారులతో విత్తనాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు శాస్త్రవేత్తలు, పంటలను జాదూ నాసిరకం విత్తనాల వల్లే పంట నష్టం జరిగిందని తేల్చి చెప్పారు. దీంతో అధికారుల కమిటీ ప్రభుత్వం 1800 మంది రైతులకు రూ.17 కోట్లు చెల్లించాలని కావేరి కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించింది. అయితే నాలుగేళ్లవుతున్నా రైతులకు మాత్రం పరిహారం అందించలేదు. దీంతో రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు వ్యవసాయ శాఖ కమిషనర్ నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతోందని మండిపడుతున్నారు.

జిల్లా అధికారుల కమిటీ ఉత్తర్వులను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కావేరి కంపెనీ యజమానులు హైకోర్టుకు వెళ్లారు. వాతావరణ పరిస్థితుల వల్లనే పత్తి పంట దెబ్బతిందని, విత్తనాల ప్రభావం ఏమీ లేదని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు హైకోర్టు స్పందించి శాస్త్రవేత్తలతోపాటు అధికారుల కమిటీ నివేదికలను పరిశీలించాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌ను ఆదేశించింది. నకిలీ విత్తనాలను తేలితే వెంటనే పరిహారాన్ని అందించాలని ఆదేశాలు ఇచ్చింది.

రెండేళ్లుగా కమిషనర్ వద్దే పరిహారం ఫైళ్లు

రైతులు పత్తి పంట సాగు కోసం రూ.లక్షలాది రూపాయలు అధిక వడ్డీలకు అప్పులు చేశారు. కావేరి కంపెనీ నాసిరకం విత్తనాలను అంటగట్టడం వల్లనే దిగుబడి తగ్గి తాము నష్టపోయామని, వెంటనే పరిహారం అందించాలని వారు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. అయితే.. వ్యవసాయ శాఖ కమిషనర్ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు రైతులకు పరిహారం అందలేదు. 2021 ఖరీఫ్‌లో జరిగిన పంట నష్టానికి కారణమైన కావేరి కంపెనీ యాజమాన్యం నుంచి రూ.17 కోట్ల పరిహారాన్ని ఇప్పించడంలో ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడంపై ఉమ్మడి జిల్లా రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పైగా కావేరి కంపెనీకే వత్తాసు పలుకుతూ దాదాపు మూడేళ్ల కాలయాపన చేయడంపై రైతు సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలోనైనా రైతులపై కనికరం చూపి నష్టపోయిన రైతులకు జిల్లా అధికారులు నిర్ధారించిన మేరకు పరిహారాన్ని అందజేయాలని, లేకపోతే ఎన్నికల్లో రైతుల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

జిల్లా మొత్తం సాగైన విస్తీర్ణం 2,50,374

ప్రస్తుతం ఈ పంట మొత్తం కాలం చెల్లిన నాసిరకం పత్తి విత్తనాలను వాడడంతో పాటు వర్షాభావ పరిస్థితుల వల్ల తెగుళ్ల కారణంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి



- రైతులకు పరిహారం ఇప్పించకుండా కంపెనీకే వత్తాసు
- 2021లో నష్టం జరిగితే నేటికీ అందని వైనం
- జాదూ రకం విత్తనాల వల్లే పంట రాలేదని నిర్ధారణ
- రూ.17 కోట్ల చెల్లింపునకు అధికారుల కమిటీ ఆదేశం
- వ్యవసాయ శాఖ కమిషనర్ నిర్లక్ష్యంతో రైతుకు దక్కని ఊరట

కఠిన చర్యలు తీసుకోవాల్సిందే



కర్నూలు జిల్లా నాసిరకం, కాలం చెల్లిన విత్తనాల తయారీకి కర్నూలు అడ్డాగా మారింది. ప్రతి ఏటా రైతులకు జరుగుతున్న నష్టాన్ని వ్యవసాయాధికారులు నివారించే చర్యలు చేపట్టడం లేదు. జిల్లా కేంద్రంలోనే ఈ విత్తనాల విక్రయాలు జోరుగా జరుగుతున్నా పట్టించుకునే వారే లేరు. గూడూరు మండలంలో నాసిరకం పత్తి విత్తనాలు, అలాగే మరి కొన్ని నియోజకవర్గాల్లో మొక్కజొన్న, మిరప తదితర నాసిరకం విత్తనాలను వాడి రైతులు నష్టపోయారు. వ్యవసాయాధికారులకు ఆయా విత్తన కంపెనీల యాజమాన్యాలు, డీలర్ల నుంచి భారీగా మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న వ్యవసాయాధికారులపై ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. విజిలెన్స్ అధికారులు అడపాదడపా తనిఖీలు చేపడుతున్నా నాసిరకం విత్తనాల వాడకం జిల్లాలో తగ్గడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సంబంధిత వ్యవసాయాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కంపెనీ యజమానులు డీలర్లతో సత్సంబంధాలు ఉన్న వ్యవసాయాధికారులను బదిలీ చేస్తే తప్ప రైతులకు న్యాయం జరిగే అవకాశం కనిపించడం లేదు.

- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

మహానందిలో ఉప లోకాయుక్త అధికారి

మహానందీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఉప లోకాయుక్త రజనీ దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

మహానంది, ఏప్రిల్ 5: మహానంది శైవ క్షేత్రంలో రాష్ట్ర ఉప లోకాయుక్త అధికారి పి.రజనీ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా హాజరైన ఆమెకు ఆలయ ముఖ మండపం వద్ద అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో ఉపలోకాయుక్త అభిషేకార్చనలు నిర్వహించారు. అలంకార మండపంలో వేదపండితులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. వీరి వెంట ఏఈఓ ఎర్రమల్ల మధు, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు. అదేవిధంగా కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా న్యాయాధికారి శ్రీనివాసరావు దంపతులు శుక్రవారం మహానందీశ్వరుడు, కామేశ్వరిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో నారా భువనేశ్వరి



మహానంది ఆలయంలో స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

మహానంది, ఏప్రిల్ 5: నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయం వద్ద టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి అభిషేకం, కామేశ్వరిదేవి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలోని అలంకార మండపంలో వేదపండితులు నారా భువనేశ్వరని సత్కరించి స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మహానందిలోని అద్భుత జలసంపద, ఆలయ చరిత్ర గురించి వేదపండితులు రవిశంకర్ అవధాని వివరించారు. భువనేశ్వరి వెంట మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, శైలజ దంపతులు, టీడీపీ నాయకులు తాతిరెడ్డి తులసిరెడ్డి, మహానంది ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ పాణ్యం ప్రసాదరావు, మండల కన్వీనర్ మధు, సూరే శ్రీనివాసులు, ఫణి, చిన్నరంగ స్వామి, ఉమాదేవి, బీకే సరోజమ్మ తదితరుల ఉన్నారు.

ఎల్లెల్సీలో జారిపడి వ్యక్తి మృతి

హాలహర్వి, ఏప్రిల్ 5: మండల కేంద్రమైన హాలహర్వి గ్రామానికి చెందిన సోమశేఖర్ (32) ఎల్లెల్సీ కాలువలో పడి మృతి చెందాడు. శుక్రవారం హొళగుందలో ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు వెళ్లిన సోమశేఖర్ దాహం వేయడంతో పక్కనే ఉన్న ఎల్లెల్సీ కాలువ ఒడ్డుకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు ఆయన కాలుజారి కాలువలో పడి గల్లంతయ్యాడు. అనంతరం హొళగుంద కాలువలో సోమశేఖర్ శవాన్ని పోలీసులు గుర్తించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మోదీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 5: ప్రధాని మోదీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానోకోవాలని, లేకుంటే ప్రజలే రాజకీయ సమాధి కడతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం పత్తికొండ పట్టణంలో సీపీఐ ఎన్నికల సన్నాహక సమావేశం స్థానిక సీఆర్ భవనం ఆవరణలో జరిగింది. ముఖ్యఅతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, కర్నూలు పార్లమెంటు అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్, పత్తికొండ సీపీఐ అసెంబ్లీ అభ్యర్థి రామ చంద్రయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ మాట్లాడుతూ ఏపీలో చంద్రబాబును జైలుకు పంపించిన ఘనత మోదీదే అన్నారు. ఏ నేరం చేయకపోయినా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను జైలులో పెట్టించారని అన్నారు. వేల కోట్ల మైనింగ్ మాఫియాకు పాల్పడిన గాలి జనార్దన్ రెడ్డి బీజేపీలో చేరితే.. నీతి మంతుడైపోతాడా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం జగన్ రెడ్డి అరాచక పాలన సాగిస్తూ వ్యవస్థలను గుప్పిట్లో ఉంచుకుని నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. పింఛన్ల పంపిణీలో సీఎం జగన్ రాజకీయ డ్రామాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో శేఖర్, రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బబు, జిల్లా నాయకులు జగన్నాథం, నబీ రసూల్; రామక్రిష్ణారెడ్డి, రంగన్న, కారన్న, ఈరన్న, కాంగ్రెస్, సీపీఎం నాయకులు శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నాటక రంగ ఖ్యాతిని చాటి చెప్పాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కళాకారులను అభినందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 5: జిల్లా నాటక రంగ ఖ్యాతిని దశదిశలా చాటి చెప్పాల్సిన బాధ్యత కళాకారులపై ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని మౌర్యఇన్‌లో గల టీజీ వెంకటేశ్ కార్యాలయంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన నందిని నాటకోత్సవాల్లో 8 నందిని అవార్డులు సాధించిన టీజీవీ కళాక్షేత్రం కళాకారులు కలిశారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ నాటక దర్శకుడు, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్యతోపాటు అవార్డులు సాధించిన కళాకారులు మహ్మద్ మియా, జీవీ శ్రీనివాసరెడ్డి, సామ్యూల్, శివయ్య, కే బాల వెంకటేశ్వర్లు, రాముడు, సంగా ఆంజనేయులు, పి. రాజారత్నం, గాండ్ల లక్ష్మణ్ణ తదితరులను శాలువా కప్పి సత్కరించారు. అనంతరం టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ పత్తి ఓబులయ్య దర్శకత్వంలో కళాకారులు ప్రదర్శించిన 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' పౌరాణిక పద్య నాటకానికి ఎనిమిది నందిని అవార్డులు రావడం కళాకారుల కృషికి నిదర్శనమని ప్రశంసించారు.

హత్య కేసులో రెండో నిందితుడి అరెస్ట్

- లుక్ అవుట్ నోటీసుల జారీ చేసిన ఎస్పీ
- న్యూ ఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్‌లో పట్టుకున్న పోలీసులు



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 5 : హత్య కేసులో రెండో నిందితుడిని అరెస్ట్ చేయడంలో నంద్యాల రెండో పట్టణ పోలీసుల శ్రమ ఫలించింది. ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడంతో నిందితుడు దేశం వదిలి వెళ్లకుండా అరెస్ట్ చేయగలిగారు. సీఐ కె.రాజారెడ్డి శుక్రవారం ఆ వివరాలను వెల్లడించారు. 2017లో నంద్యాల రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెక్కె ప్రాంతానికి చెందిన గంగు ఆనంద్‌కుమార్ అలియాస్ ఆనంద్ అలియాస్ సుబ్బరాయుడు అనే వ్యక్తి తాను నంద్యాల పెద్ద చర్చి డయాసిస్ సెక్రటరీనని ఎయిడెడ్ టీచర్ల ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి కొందరిని నమ్మించాడు. అతడి మాటలు నమ్మిన తిరుపతి ఎంఆర్‌పల్లికి చెందిన కొప్పుల సురేంద్ర, అరవ సోమశేఖరరెడ్డి, మరో 30మంది నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. అయితే నంద్యాల డయాసిస్‌లో ఎలాంటి ఉద్యోగాలు లేవని తెలుసుకున్న బాధితులు తాము కట్టిన డబ్బులు తిరిగి చెల్లించాలని గంగు ఆనంద్‌పై ఒత్తిడి తెచ్చారు. గంగు ఆనంద్ డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో 11.11.2019న కొప్పుల సురేంద్ర, సోమశేఖర్‌రెడ్డి ఇంకా కొంత మంది కలిసి నంద్యాల టెక్కెలోని గంగు ఆనంద్ ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు అడిగారు. డబ్బులు ఎగ్గొట్టాలనే ఉద్దేశంతో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం గంగు ఆనంద్, అతడి భార్య యోగేశ్వరి, వారి కుమారుడు గంగు యువరాజ్‌లు కలిసి వారిపై దాడి చేశారు. కత్తులతో పొడవడంతో వారిద్దరికి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అరవ సోమశేఖర్‌రెడ్డి మృతి చెందాడు. దీంతో రెండో పట్టణ పోలీసులు నిందితులపై క్రైం నెం.199/2019గా హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొదటి నిందితుడు గంగు ఆనంద్ కుమార్, మూడో నిందితురాలు గంగు యోగేశ్వరిలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రెండో నిందితుడైన గంగు యువరాజ్ పోలీసులకు దొరక్కుండా తప్పించుకొని తిరుగుతుండేవాడు. అయితే యువరాజ్ పాస్‌పోర్ట్ నెంబరు తెలుసుకొని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అన్ని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లకు లుక్ అవుట్ నోటీసులు పంపి నిందితుడు దేశం నుండి తప్పించుకొని వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఇదేమీ తెలియని నిందితుడు యువరాజ్ కజకిస్థాన్ వెళ్లాలనే ఉద్దేశంతో న్యూ ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలనలో ఎయిర్‌పోర్ట్ ఇమ్మిగ్రేషన్ అధికారులు కనిపెట్టి ఆ సమాచారాన్ని నంద్యాల ఎస్పీకి చేరవేశారు. వెంటనే ఎస్పీ రఘువీర్‌రెడ్డి నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల టూ టౌన్ సీఐ కె.రాజారెడ్డి, ఏఎస్సై బి.జఫ్రుల్లాఖాన్, కానిస్టేబుల్ పి.శైలాస్‌లను బృందంగా నియమించి పంపారు. ఆ బృందం న్యూ ఢిల్లీ చేరుకొని గంగు యువరాజ్‌ను అదుపులోకుంది. నంద్యాలకు తీసుకువచ్చి శుక్రవారం నంద్యాల జేఎఫ్‌సీఎం ఎదుట హాజరు పరచగా నిందితుడికి రిమాండ్ విధించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో చొరవచూపిన నంద్యాల టూ టౌన్ సీఐ రాజారెడ్డి, ఏఎస్సై బి.జఫ్రుల్లాఖాన్, కానిస్టేబుల్ పి.శైలాస్‌లను ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డిలు అభినందించారు.

ఈ నెల చివరిలోగా ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 5: రైతులు సాగు చేసిన పంటల ఈక్రాప్ నమోదు ఈ నెలాఖరుకు పూర్తవుతుందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వేసవి సీజన్‌లో సాగు చేసిన పంటలను నమోదు చేసేందుకు ఈ నెల 3వ తేదీన మొబైల్ అప్లికేషన్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. వర్షాల ఆధారంగా పంటలు సాగు చేసే అవకాశం లేదని, బావులు, బోర్లు, చెరువుల కింద కూరగాయలు, ఆరుతడి పంటలు రైతులు సాగు చేస్తారని, ఈ పంటలను రైతులు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారో ఈక్రాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



నంద్యాలలో జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న అడ్వకేట్స్ అసోసియేషన్ నాయకులు



తమ్మరాజుపల్లెలో జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ కార్యకర్తలు



ఆత్మకూరులో..

నంద్యాల టౌన్, ఏప్రిల్ 5: ఆర్‌ఏఆర్ఎస్‌లో ఏడీఆర్ డాక్టర్ ఎస్.సరళమ్మ అధ్యక్షతన బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్‌రామ్ నడిచిన బాట, చూపిన సంస్కరణలు భావీ తరాలకు ఆదర్శ ప్రాయమని ఆమె అన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ సుజాతమ్మ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వెంకటరమణమ్మ, డాక్టర్ పుల్లీబాయి, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, డాక్టర్ నరసింహుడు, ఆర్ఏఆర్ఎస్ సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

● ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కె. నాగేంద్రప్ప, జిల్లా సహాధ్యక్షుడు శ్రీహరి, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షురాలు ఆర్.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతినినిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల క్రైం: బస్టాండ్ సమీపంలోని విక్టోరియా రీడింగ్ రూమ్ ఎదుట జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులు, అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరుడు, ఉపాధ్యక్షుడు ఎస్.జీవన్‌రాజు, కార్యదర్శి కె.పుల్లన్న, సహాయ కార్యదర్శి వనం శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాణ్యం: తమ్మరాజుపల్లెలో టీడీపీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పాణ్యం ఎస్సీ హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు చల్లా సురేష్‌బాబు, నాగరాజు, మధు, దుబాయ్ శీను, రాజేంద్ర, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, టీడీపీ నాయకులు మాండ్ర లింగారెడ్డి డా.బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముర్తుజావలి, షకీల్ అహ్మద్, గని, రాజు, రాజన్న కళాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పాతబస్టాండ్ వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. మాల మహానాడు తాలుకా అధ్యక్షుడు చింతలయ్య, ఉపాధ్యక్షులు రవికుమార్, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోషియేషన్ శీలయ్య, ప్రజాసంఘాల నాయకులు భాస్కర్, చెన్నకేశవులు ఉన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో దళిత సంఘాల నాయకులు చిలుక రాబిన్‌సన్ రాజు, మల్లయ్య, ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

గోస్పాడు: గోస్పాడు మండల పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు పాల్గొని బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బి.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు సుబ్బరాయుడునాయక్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ఆంజనేయ స్వామి గుడి ఆవరణలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగశేషులు, ఆరోగ్యం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కార్యకర్తలే టీడీపీకి కొండంత అండ

● నారా భువనేశ్వరి



నారాయణను అభినందిస్తున్న నారా భువనేశ్వరి

బండిఆత్మకూరు, ఏప్రిల్ 5: తెలుగు దేశం పార్టీకి ఏ పార్టీకి లేనంత కార్యకర్తలు కొండంత అండగా ఉన్నారని నారా భువనేశ్వరి అన్నారు. మండలంలోని నారాయణపురంలో శుక్రవారం సాయంత్రం చింతల నారాయణను నారా భువనేశ్వరి అభినందించారు. అక్కడ వారి కుటుంబ సభ్యులు తీర్చిదిద్దిన ఎన్‌డీఏ కూటమి రంగవల్లిని ఆమె పరిశీలించారు. భువనేశ్వరి మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో చంద్రబాబుకు సంఘీభావంగా నారాయణ రాజమండ్రికి కాలినడకన వెళ్తుండగా వినుకొండ సమీపంలో వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరచడం దుర్మార్గమన్నారు. అయినా నారాయణ ఆసుపత్రిలో చికిత్స అనంతరం తిరిగి పాదయాత్ర ప్రారంభిస్తే ప్రభుత్వం పోలీసులతో అటకించి నారాయణను ఇంటికి పంపిందన్నారు. టీడీపీ ఎంతో ధైర్యం, దమ్ము ఉన్న కార్యకర్తలు ఉన్నారని నారాయణను అభినందించారు. ఆమె వెంట బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, చిట్టిబొట్ల భరద్వాజశర్మ, సునీత, సురేష్‌రెడ్డి, మనోహర్‌చౌదరి, నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, బుగ్గరాముడు, చిన్న లింగారెడ్డి, కె.శంకర్, ఎం.కృష్ణారెడ్డి, వి.శ్రీనివాసుల, ముధుభూపాల్, జాకీర్, సిద్ధయ్య, బాబు, డిష్ రామలింగం, చెన్నారెడ్డి, జనసేన సురేష్ పాల్గొన్నారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు

శ్రీశైలం, ఏప్రిల్ 5: శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం రోజున భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 26 న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం గానీ, శుక్రవారం గానీ అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

వైభవంగా లక్ష పుష్పార్చన

ఆత్మకూరు, ఏప్రిల్ 5: ఆత్మకూరు పట్టణంలో వెలసిన భూవరాహి సహితి, పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 24వ వార్షిక వేడుకల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన క్రతువును వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో సుప్రభాతసేవా, ఆరాధన, నివేదన, గోష్టి, చతుఃస్థానార్చన, చూర్ణోత్సవాన్ని, 108 కలశాలతో విశేష అభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు గోదాసమేత వేంకటేశ్వర స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు దేవస్థానం ప్రధాన అర్చకుడు దేవరపల్లి అనిల్‌కుమార్ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ఏకాదశి పూజలు

నంద్యాల (కల్చరల్), ఏప్రిల్ 5: నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో శుక్రవారం, ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వరస్వామి మూల విరాట్‌కు, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉమామహేశ్వర ఆశ్రమంలో ఉదయం భగవద్గీత పారాయణం చేశారు. శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

విగ్రహాల ప్రతిష్ఠ



కర్రెమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్థులు

మిడుతూరు, ఏప్రిల్ 5: మండలంలోని 49బన్నూరు గ్రామంలో గ్రామదేవతలు కర్రెమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠను పండితులు రఘురామయ్య, వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం వైభంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు యంత్రప్రతిష్ఠ స్థాపన, దృష్టి దోష నివారణ, పూర్ణాహుతి కలశ ఉద్వాసనం నిర్వహించారు. కార్యక్రమంలో బలరాముడు, హరీష్, వెంకట రమణ, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'శాంతియుతంగా ఉండాలి'



జూలేపల్లె గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి

గోస్పాడు, ఏప్రిల్ 5: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులు శాంతియుతంగా ఉండాలని ఎస్ఐ నాగార్జునరెడ్డి సూచించారు. శుక్రవారం పోలీస్ బెటాలియన్లతో పసురుపాడు, జూలేపల్లె, చింతకుంట్ల గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారని, ఏ చిన్న సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఒకరి కొకరు రెచ్చగొట్టుకునేలా, కించపరుచుకునేలా వ్యవహరించకూడదన్నారు.

మహిళల జోలికొస్తే ఖబడ్దార్

● బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హెచ్చరిక ● బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించిన టీడీపీ నాయకులు



బాధితురాలితో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు బైరెడ్డి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న లింగారెడ్డి, జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 5: పట్టణంలోని ముస్లిం మహిళ ఆలియా బేగం పట్ల వైసీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి వ్యవహరించిన తీరుపై టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం సుబ్బారావు పేటలోని ఆమె ఇంటి వద్దకు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి చేరుకొని జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోకవర్గ ప్రధాన నాయకుడి అండదండతోనే మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి చెలరేగిపోతున్నాడని ఆరోపించారు. నియోజకవర్గంలో వైసీపీ గూండాల నుంచి ఆడపిల్లలకు భద్రత లేకుండా పోతోందన్నారు. శ్రీనివాసరెడ్డిని ఎవరు ప్రోత్సహిస్తున్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. రెండు నెలల్లో వచ్చేది టీడీపీనే అని మహిళల జోలికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చర్యలు తీసుకోవాలి: జయసూర్య

నందికొట్కూరులో మహిళలకు భద్రత కరువైదని టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య అన్నారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాస రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, అలాగే వైసీపీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబం తరుపున న్యాయ పోరాటం చేస్తామన్నారు.

'నిర్భయ కేసు నమోదు చేయాలి'

పరిచయం ఉన్న వ్యక్తుల పట్ల దుర్భాషలాడి, అవమానపరచడం చాలా అమానుషమని టీడీపీ నాయకులు మాండ్ర లింగారెడ్డి అన్నారు. శ్రీనివాసరెడ్డిని నిర్భయ చట్టం కింద అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్, ముర్తుజావలి, గని తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రార్థనలు



ప్రార్థన చేస్తున్న ముస్లింలు

వెలుగోడు, ఏప్రిల్ 5: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న మసీదులు ముస్లింలతో కిటకిటలాడాయి. పవిత్ర రంజాన్ మాసంలో చివరి శుక్రవారం కావడంతో ప్రార్థనల కోసం ముస్లింలు భారీగా తరలివచ్చారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షాపరులకు సీపీ నగర్ మసీదులో నవజవాన్ కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు.

సహ ఆచార్యుడికి డాక్టరేట్



రాజశేఖర్

పాణ్యం, ఏప్రిల్ 5: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ సహ ఆచార్యుడు రాజశేఖర్‌కు అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతనెల 28 వతేదీన రాజశేఖర్ అధ్యయనం చేసిన 'ఎ స్టడీ ఆన్ ఇంపాక్ట్ ఆఫ్ కార్పొరేట్ యాక్షన్ ఆన్ ఇన్వెస్టర్స్ రియాక్షన్ అండ్ షేర్ ప్రయిస్ మూమెంట్ విత్ రెఫరెన్స్ టు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్' అంశానికి డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. కళాశాల ఎండీ శివరాం, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

నంద్యాల రూరల్, ఏప్రిల్ 5: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీడీ హుసేన్ బాబు అన్నారు. నంద్యాల మండలంలోని కానాల గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను రూపొందించారన్నారు. ఓటర్లు అప్రమత్తం కాకుంటే రాష్ట్రం అథోగతి పాలవుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది హనీఫ్ బాషా, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దస్తగిరి, గ్రామ మాజీ సర్పంచ్ పీడీ హుసేన్, మాజీ ఉప సర్పంచ్ బాల మద్దిలేటి, ఎంపీటీసీ మదార్సా సంజన్న తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మందుల పంపిణీ



మాత్రలు, మజ్జిగ అందిస్తున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు

పాములపాడు, ఏప్రిల్ 5: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం పాదయాత్ర వెళ్లే కన్నడ భక్తులకు నంద్యాల జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మాత్రలు, మజ్జిగ పంపిణీ చేశారు. శుక్రవారం పాములపాడులోని శ్రీ నారాయణరెడ్డి డిగ్రీ కళశాల ఆవరణలో మండల ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం గౌరవ అధ్యక్షుడు మణిరాజు అధ్యక్షతన పాదయాత్రికులకు ఉచితంగా మందులను, చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున శక్తిని కోల్పోకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని భక్తులకు పంపిణీ చేశారు. దాదాపు 500 మందికి పైగా భక్తులకు వివిధ రకాల మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, రాజు, శ్రీనివాసులు, నాగరాజు, మౌలాలి, రాజేశ్, అలీ, తదితరులు పాల్గొన్నారు.

'పంట నష్ట పరిహారం చెల్లించాలి'



జిందాల్ పరిశ్రమకు చెందిన వాహనాలను అడ్డుకున్న రైతులు

గడివేముల, ఏప్రిల్ 5: జిందాల్ పరిశ్రమ నుంచి వచ్చే దుమ్ము, ధూళి పంటలపై పడుతుండడంతో పైర్లు ఎదగలేక దిగుబడులు తగ్గిపోతున్నాయని, నష్ట పరిహారం అందించాలని మండలంలోని బిలకలగూడూరు రైతులు డిమాండ్ చేశారు. పరిశ్రమల నుంచి వచ్చే వాయు కాలుష్యాన్ని తగ్గించి నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని శుక్రవారం రైతులు ధర్నా చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి జిందాల్ పరిశ్రమ వాహనాలను అడ్డుకున్నారు. జిందాల్ పరిశ్రమ సిబ్బంది రైతులతో చర్చించారు. రైతులు మాట్లాడుతూ పరిశ్రమలో నిల్వ ఉన్న బొగ్గు నిల్వల నుంచి వచ్చే దుమ్ము, ధూళి పంటలపై పడుతుండడంతో పంటలు ఎదగలేకపోతున్నాయని అన్నారు. పంట దిగుబడి సాధారణ దిగుబడి కంటే పది శాతం తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పైర్లపై దూళి ఉండడంతో పశుగ్రాసానికి కూడా పనికిరావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పండిన ధాన్యం కూడా రంగు మారడంతో మార్కెట్‌లో సరైన ధర రావడం లేదన్నారు. అనంతరం జిందాల్ ప్రతినిధులు మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు తక్కువ ధరకు విక్రయించి ఉంటే ఆ నష్ట పరిహారాన్ని కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. కాలుష్యం వల్ల నష్టపోతున్నందున జిందాల్ పరిశ్రమ యాజమాన్యం ఎరువులు, క్రిమిసంహారక మందులను పంపిణీ చేయాలని రైతులు కోరారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి రైతులకు న్యాయం చేస్తామని పరిశ్రమ ప్రతినిధులు వెల్లడించారు.

22 ఏళ్లుగా అన్నదానం



శ్రీపతిరావు పేట గ్రామ శివారులో అన్నదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న శరణ బసవేశ్వర ఆలయ కమిటీ సభ్యులు

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 5: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీగిరి చెంతకు తరలివెళ్లే కన్నడ పాదయాత్రికుల కోసం కర్ణాటక రాష్ట్రానికి చెందిన పలువురు దాతలు పలు చోట్ల అన్నశిబిరాలను ఏర్పాటు చేసి భక్తుల సేవలో తరిస్తున్నారు. ప్రత్యేకించి కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని షాజా నగర్‌కు చెందిన చెందిన శరణ బసవేశ్వర ఆలయ కమిటీ సభ్యులు ఆత్మకూరు మండలం శ్రీపతిరావు పేట గ్రామ శివార్లలో కన్నడ పాదయాత్రికులకు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి భక్తుల సేవలో తరిస్తున్నారు. ఈ శిబిరంలో రోజుకు సుమారు ఇరవై వేల మంది భక్తులు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు.ఇందుకోసం గుల్బర్గా నుంచి 50 మంది సేవకులు తరలి వచ్చి గత వారం రోజులుగా నిరంతరం శ్రమిస్తున్నారు. శరణ బసవేశ్వర ఆలయ కమిటి అధ్యక్ష ,కార్యదర్శులు శరవణన్, రాజు ఆధ్వర్యంలో గుల్బర్గాలోని దాతల సహకారంతో గత 22 ఏళ్లుగా మండల పరిధిలోని శ్రీపతిరావుపేట గ్రామ శివార్లలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అల్పాహారంతో పాటు రాత్రి వరకు అన్నదాన శిబిరంలో భక్తులు పాల్గొంటున్నారు. ఈ నెల 9 వరకు అన్నదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: బైరెడ్డి



టీడీపీలో చేరిన నాయకులతో బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నందికొట్కూరు, ఏప్రిల్ 5: టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోరారు. నందికొట్కూరులోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో శుక్రవారం పగిడ్యాల దళిత కాలనీకి చెందిన 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారిలో వెంకటేశ్వర్లు, తిరుపాలు, రాజు, చిన్న శేషన్న, నాగరాజు, స్వాములు, తిక్కస్వామి, రంగస్వామి, స్వాములమ్మ తదితరులు ఉన్నారు.

కల్లూరు అర్బన్‌లో వైసీపీకి షాక్

గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిక



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన పందిపాడు వైసీపీ నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 5: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. కల్లూరు అర్బన్ 28 వార్డులో వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీలో చేరారు. శుక్రవా రం పందిపాడులోని బీఆర్‌రెడ్డి కాలనీకి చెందిన వైసీపీ నాయకులు జయ మోహన్ రెడ్డి, రమణమ్మ, వసంతి, వెంకటేశ్వరమ్మతోపాటు 70 కుటుంబాలు పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్ చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి గౌరు దంపతులు ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు.

టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి: టీడీపీ కూటమి అధికారం లోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 34వ వార్డు నిర్మల్‌నగర్‌లో ఆమె శంఖారావంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని మేని ఫేస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీపై విసుగు చెందిన ప్రజలు టీడీపీ కూటమికి పట్టం కట్టనున్నారన్నారు.

'భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయాలి'



నాగలూటిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మిడుతూరు, ఏప్రిల్ 5: మండలంలోని నాగలూటి గ్రామంలో 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శనివారం నారా భువనేశ్వరి వస్తున్నారని, ఆమె పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి పిలుపునిచ్చారు. నాగలూటి గ్రామంలో నిజం గెలవాలి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమగు స్థల సేకరణ, ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. సంపంగి రవీంద్రబాబు, రంగా రెడ్డి, రమణారెడ్డి, రామలింగుశ్వరరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, జమ్మలయ్య పాల్గొన్నారు.

'నిబంధనల ప్రకారమే ప్రసారాలు చేయాలి'

పాణ్యం, ఏప్రిల్ 5: ఎన్నికల కమిషన్ నిబంధనలకు ప్రకారమే ప్రసారాలు చేయాలని పాణ్యం సీఐ నల్లప్ప హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మీడియా, యూట్యూబ్ చానళ్లు, అలాగే సోషల్ మీడియా చానళ్లు ఎన్నికల నిబంధనలకు లోబడి సమాచారాన్ని ప్రసారం చేయాలన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీడియా, యూట్యూబ్ చానళ్ల ద్వారా ప్రసారమయ్యే పోస్టులతో సమాజంలో ఏదైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. సెల్ ద్వారాగానీ, పత్రికల ద్వారాగానీ, ఏదైన ప్రసారాల ద్వారా గానీ జరిగే ప్రతి సమాచారం కేంద్ర మంత్రిత్వశాఖలో నమోదవుతుందని చెప్పారు. ఈ సూచనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

ఆరుగురికి కుక్కకాటు

గడివేముల, ఏప్రిల్ 5: మండల కేంద్రంలో శుక్రవారం కుక్క స్వైర విహారం చేసింది. వీధిలో తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురి చేసింది. గడివేముల గ్రామానికి చెందిన కిరణ్, ఉస్మాన్, పుల్లయ్య, జమాల్‌బాషా, కె.బొల్లవరం గ్రామానికి చెందిన మణిధర్, మంచాలకట్ట గ్రామానికి చెందిన సోమశేఖర్ కుక్క కాటుకు గురయ్యారు. బాధితులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్

ప్యాపిలి, ఏప్రిల్ 5: మండలంలోని రాచెర్ల గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కుమారుడు బుగ్గన అర్జున్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఇదే మండలంలోని బూరుగుల గ్రామానికి చెందిన వలంటీర్ చిన్నదేవుడు పాల్గొన్నారు. వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన కూడదని అధికారులు చెబుతున్న వారు తమ తీరు మార్చుకోవడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రచారంలో పాల్గొన్న వలంటీర్‌ను వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని టీడీపీ వర్గీయులు ఎన్నికల అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

ప్యాపిలి, ఏప్రిల్ 5: మండలంలోని మెట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థుకు ఉపాధ్యాయుడు చిన్నపరెడ్డి మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు అధికంగా ఉన్నందన విద్యార్థులు వడదెబ్బకు గురికాకుండా తన వంతుగా ఈ మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పాఠశాల జరిగే చివరి రోజు వరకు మజ్జిగను పంపిణీ చేస్తానని ఆయన తెలిపారు.

అనుమతి లేకుండా తవ్వకాలు
చేపడితే కేసులు నమోదు చేస్తాం

రుద్రవరం, ఏప్రిల్ 5 : రుద్రవరం మండలం ఆలమూరు చీలబోయిన చెరువులో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. శుక్రవారం చెరువులో అక్రమ తవ్వకాలు అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో స్పందించిన తహసీల్దార్ చెరువును తహసీల్దార్ పరిశీలించారు. చెరువులో తవ్వకాలు జరుగుతుంటే మీరు ఏమి చేస్తున్నారని వీఆర్‌ఏలను ప్రశ్నించారు. మట్టి తవ్వకాలు నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎఎస్‌ఐ బాలన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహన్యాస రుద్రాభిషేకం

చాగలమర్రి, ఏప్రిల్ 5: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుభ శుక్రవారం సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో మహన్యాస రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు సామూహిక వడిబియ్యం, 108 దీపాలు వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, మహిళలు పాల్గొన్నారు.

వడగాల్పులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఏప్రిల్ 5: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమణమ్మ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోనే 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని అన్నారు. గ్రామాల్లోని ప్రజలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఎండలో తిరగరాదని, నీడనిచ్చే ప్రదేశాల్లో ఉండాలని అన్నారు. పిల్లలు, వృద్ధులు వేడి గాలుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వడగాలులు మరింత పెరిగే అవకాశం ఉందని, వడదెబ్బ సోకకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసర సమయాల్లో బయటకు వెళ్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వడదెబ్బ సోకిన వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోవాలని అన్నారు.

టీడీపీ నాయకుడి మృతి తీరని లోటు

చాగలమర్రి, ఏప్రిల్ 5: మండలంలోని నగల్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పెద్ద ఓబులేసు (38) మృతి తీరని లోటని ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. ఈనెల 4న కూలూరు రహదారిలో పెద్ద ఓబులేసు ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం విషయం తెలుసుకున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల్లో మనోధైర్యం నింపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పెద్ద దస్తగిరి, బాల దస్తగిరి తదితరులు ఉన్నారు.

మండలంలోని నగల్లపాడు గ్రామానికి చెందిన పెద్ద ఓబులేసు మృతి పట్ల ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండూవీరయ్య మాదిగ సంతాపం ప్రకటించారు. శుక్రవారం నగల్లపాడు గ్రామానికి చేరుకొని ఓబులేసు మృతదేహంపై పూలమాల వేసి సం తాపం తెలిపారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

డోన్, ఏప్రిల్ 5: డోన్ మున్సిపాలిటీలో టీడీపీలోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో వైసీపీ నాయకుడు జహంగీర్‌తో పాటు మరో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అదే విధంగా తిరునాంపల్లికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కొత్తబురుజులో వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ హంశేనప్ప కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, అన్వర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ మాత పల్లకీ సేవ

బనగానపల్లె, ఏప్రిల్ 5 : నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోవెలకుంట్ల ఏప్రిల్ 5: కోవెలకుంట్ల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. సంజామల గ్రామానికి చెందిన చెంచురెడ్డి అనే వ్యక్తి మోటర్ బైక్ పై కోవెలకుంట్లకు వచ్చి పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వేర్‌హౌస్ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. చెంచిరెడ్డిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీలోకి భారీగా వలసలు


కాశీపురం వైసీపీ నాయకులకు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

కండువా కప్పి పార్టీలోకి
ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే బీసీ

బనగానపల్లె, ఏప్రిల్ 5: టీడీపీలోకి చేరికల జాతర మొదలైంది. రోజు రోజుకూ చేరికలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను భరించలేక టీడీపీలో చేరుతున్నామని నాయకులు పేర్కొంటున్నారు. శుక్రవారం 250 వైసీపీ కుటుంబాలు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. అవుకు మండలం కాశీపురం, సుంకేసుల, చనుగొండ్ల గ్రామాల నుంచి 250 కుటుంబాలు వైసీపీని వీడి బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో బనగానపల్లె నియోజకవర్గం జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అవుకు మండలం కాశీపురం గ్రామానికి చెందిని మొట్ల రామిరెడ్డి ఆధ్వర్యంలో 100 వైసీపీ కుటుంబాలు చేరారు. వైసీపీ కీలకనేతలు ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, వెంకటరెడ్డి, తదితర వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

● నియోజకవర్గంలోని సుంకేసుల గ్రామంలో వైసీపీ ఖాళీ అయింది. సుంకేసుల గ్రామనికి చెందిన 80 కుటుంబాలు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, తలారి రాంభూపాల్, రామకృష్ణ, రమేశ్, మునిస్వామి,నారాయణస్వామి, పాపోడు, పెద్దసుబ్బయ్య, రామ్మోహన్, శివ, నారాయణ, సుబ్బరాయుడు, శేఖర్, శ్రీనివాసులు, రంగయ్య వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

● అవుకు మండలం చనుగొండ్ల గ్రామంలో మొట్ల రామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీలో చేరారు. గ్రామానికి చెందినమోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నారాయణరెడ్డి,గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితర 70 కుటుంబాలు టీడీపీలో చేరారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పండి: బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె రూరల్: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని బీసీ ఇందిరమ్మ ప్రజలకు సూచించారు. బీసీ స్వగ్రామం యనకండ్లలో శుక్రవారం సాయంత్రం బీసీ ఇందిరమ్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో బీసీ జనార్దన్‌రెడ్డి గ్రామం మొత్తం సీసీ రోడ్లు, డ్రైనేజీ వేయించారని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి సిమెంట్ పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ తెలుగుయువత అధ్యక్షులు బొబ్బల గోపాల్‌రెడ్డి, బొబ్బల మదనభూపాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, దివాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, యర్రగుడి మహేశ్వరరెడ్డి, సాదుల రామచంద్రారెడ్డి, సాదుల శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.


యనగండ్లలో ప్రచారం చేస్తున్న బీసీ ఇందిరమ్మ


ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీసీ జనార్దన్‌రెడ్డి

ఇఫ్తార్ విందు: ముస్లింలందరూ నా కుటుంబ సభ్యులని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణంలోని లాల్ మసీద్ నందు రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం యువకుల ఆహ్వానం మేరకు శుక్రవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందుకు బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈమేరకు మసీదులో బీసీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఇఫ్తార్ విందులో ముస్లింలకు బీసీ స్వయంగా భోజనం వడ్డించారు. వారితో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు.

బుగ్గన సామ్రాజ్యాన్ని కూల్చడం ఖాయం

● టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


తిరునాంపల్లిలో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఏప్రిల్ 5: డోన్ నియోజకవర్గంలో దొరలా పాలన సాగించిన మంత్రి బుగ్గన సామ్రాజ్యాన్ని ప్రజలు కూల్చేయడం ఖాయమని టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం డోన్ మండలంలోని గూండాల, కోట్రాయి, తిరునాంపల్లి, కొత్తబురుజు, నక్కలవాగుపల్లి, కొత్తకోట గ్రామాల్లో కోట్ల ప్రచారం నిర్వహించారు. తిరునాంపల్లి గ్రామంలో జయహో బీసీ సభలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని బుగ్గన డోన్ నియోజకవర్గాన్ని దొరలా శాసించి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారనీ ధ్వజమెత్తారు. తాము వేసిన రోడ్ల మీద మళ్లీ రోడ్లు వేసి తానేదో అభివృద్ధి చేసినట్లు బుగ్గన గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రిగా బుగ్గన నియోజకవర్గానికి ఏమీ మేలు చేయలేదు కాబట్టే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. బుగ్గన నియంతృత్వ పోకడలపై విసిగుచెంది సొంత అనుచరులే టీడీపీలోకి వస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బుగ్గలా ఉన్న బుగ్గన సామ్రాజ్యం పగిలిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీలు శేషఫణిగౌడు, శ్రీనివాసులు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, కొత్తకోట శ్రీను, రంజిత్ కిరణ్, తూర్పు లింగారెడ్డి, ప్రసాద్ రెడ్డి, గిరిరెడ్డి, బావిరెడ్డి, గుండాల నారాయణస్వామి, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకులు బ్రహ్మం పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

టీడీపీ అధినేత చంద్రబాబుతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీడీపీ డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని 30, 31 వార్డులలో ఆమె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, కేఈ శ్యాం, మర్రి మణి, బైసాని రాజు, మెకానిక్ బాషా, దస్తగిరి, చాటకొండ రజిని, ఎన్‌ఈ సరోజ, బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల కలలకు సాకారం


శిరివెళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, ఏప్రిల్ 5 : రాష్ట్రంలోని పేదల కలలు టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. శిరివెళ్లలోని బలిజపేట, సలాదిపేటలో ఆమె శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలు, వృద్ధులు, యువతకు అందించనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, యామా శ్రీనివాసులు, పీపీ లింగమయ్య, బాలచంద్రుడు, యామా శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి, ఉల్లి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

● మండలంలోని యర్రగుంట్ల ఎస్సీ కాలనీకి చెందిన వసంత్, జయపాల్, లక్ష్మీనరసింహ, సుభాష్, జో లెస్, సాలన్న, బాలకృష్ణ తదితరులు తమ అనుచరులతో 50 కుటుంబాలు వైసీపీని వీడి భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్ నాయుడుల సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కమతం జయరామిరెడ్డి, పుల్లారెడ్డి, లక్ష్మిరెడ్డి, సుబ్బారెడ్డి, సత్తారు లక్ష్మిరెడ్డి, వెదుర్ల నాగేశ్వరరావు, జాకీర్ హుసేన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


భూమా జగత్ విఖ్యాతరెడ్డి సమక్ష్యంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చాగలమర్రి: చాగలమర్రిలోని కోటగడ్డ వీధిలో టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా ఆధ్వర్యంలో భూమా జగత్ విఖ్యాతరెడ్డి సమక్షంలో వైసీపీ నాయకులు ఫయాజ్, షరీఫ్, ఆరిఫ్, రఫి, షబ్బీర్, మరో 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు గుత్తి నరసింహులు, కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, మౌలాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, గఫార్, ఖాజా రసూల్, శేఖర్, బషీర్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని ముస్లింలకు శుక్రవారం పట్టణంలోని శ్రీరామ కళ్యాణమండపం ఆవరణలో మాజీ మంత్రి అఖిలప్రియ, ఆమె భర్త బార్గవ్‌రామ్‌నాయుడు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

అనాథ వృద్ధులకు ఫింఛన్లు పంపిణీ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 5: కోవెలకుంట్లలో ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు రిటైర్డ్ గ్రంథాలయ అధికారి పల్లె నరసింహారెడ్డి పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. శ్రీవిద్వాన్ వెంకట్ స్వామి రచించిన సూక్తి కళానిధి పుస్తకాన్ని రిటైర్డ్ హెడ్ మాస్టర్ నారాయణ స్వామి చేతుల ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్ హెచ్‌ఎం. నారాయణ స్వామి, క్రాఫ్ట్ టీచర్ బాబు, అరవ వెంకట స్వామి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ జూదాన్ని నిషేధించాలి

డోన్(రూరల్), ఏప్రిల్ 4: ఆన్‌లైన్ పేకాట, రమ్మీలను నిషేధించాలని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం డోన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ పేకాట, రమ్మీల ఆటల్లో వేలాది రూపాయల డబ్బులను పోగొట్టుకుని కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇటువంటి ఆన్‌లైన్ పేకాట రమ్మీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి వాటిని నిషేదించాలని ఆయన కోరారు.

వైసీపీకి ఇటిక్యాల బాలిరెడ్డి రాజీనామా



కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 5: కొలిమిగుండ్ల మండలం వైసీపీకీలకనేత ఆపార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఇటిక్యాల బాలిరెడ్డి శుక్రవారం వైసీపీకి రాజీనామా చేశా రు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యే కాటసానిరామిరెడ్డికి తన రాజీనామా పత్రాన్ని పంపినట్లు వెల్లడించారు. ఇటిక్యాల బాలిరెడ్డి త్వరలోనే తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది.

వాహనాల తనిఖీ

కొలిమిగుండ్లరూరల్, ఏప్రిల్ 5: మండలంలోని జమ్ములమడుగు సర్కిల్ సమీపంలోని జిల్లా అధికారులు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిని జ్యోతి, సిబ్బంది శ్రీనివాసులు అనంతపూర్-అమరావతి ప్రధాన రహదారిలో రాకపోకలు సాగిస్తున్న పలు వాహనాలను పరిశీలించారు.

రుద్రవరం : మండలంలోని పెద్దకంబలూరుమెట్ట, నరసాపురం మెట్ట, ఇంకా ఇతర ప్రాంతాల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి రాణి శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలు కూడా ఆపి తనిఖీ చేశారు. ఎన్నికల్ కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు


కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

బేతంచెర్ల, ఏప్రిల్ 5: మండలంలోని గూటుపల్లె గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి, శేఖర్, బాషా, నాగ రామాంజనేయులు, గోపాల్‌తో కలిసి సుమారు 60 వైసీపీ కుటుంబాలు డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి కోట్ల సుజాతమ్మ పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచక దౌర్జన్యం, గూండాయిజం సైకో జగన్ పాలన చేశాడని దీంతో ప్రజలు విసిగి పోయి టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలూరు వెంకటేశ్వర‌రెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, తిరుమలేష్ చౌదరి, రవీంద్ర నాయక్, షేక్షావలి చౌదరి, చంద్రశేఖర్, సుధాకర్, మేకల నాగరాజు, వార్డు కౌన్సిలర్లు రామాంజనేయులు, రామగోపాల్, నంద్యాల మధు, టైలర్ రాముడు పాల్గొన్నారు.

● నగర పంచాయతీ పరిధిలోని 10, 18 వార్డులలో కోట్ల చిత్రమ్మ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, బుగ్గన మాధవిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు రామాంజనేయులు, రవీంద్రనాయక్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

డోన్(రూరల్), ఏప్రిల్ 4: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడంతో మంచినీటి ట్యాంకరును ఏర్పాటు చేసి ట్యాంకరు ద్వారా నీరు అందిస్తున్నారు. ఇటీవల వెంకటనాయునిపల్లె గ్రామ టీడీపీ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు తాగునీటి సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ట్యాంకరును ఏర్పాటు చేశారు. మంచినీటి ట్యాంకరుకు పూజలు చేసి తాగునీటి సరఫరాను అందించారు.సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ కుమార్ తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

దొర్నిపాడు, ఏప్రిల్ 5: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందని టీడీపీ మండల నాయకుడు మల్లేశ్వర చౌదరి, మాజీ ఆలయ ధర్మకర్త లింగుట్ల వెంకట్ నాయుడు అన్నారు. శుక్రవారం నంద్యాలలో నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి నంద్యాలకు రావడంతో దొర్నిపాడు, చాకరాజువేముల, భాగ్యనగరం గ్రామాల టీడీపీ నాయకులు వివిధ వాహనాల్లో తరలివెళ్లి కలిశారు.

ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలి

నంద్యాల, ఏప్రిల్ 5, ఆంధ్రజ్యోతి: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని ఆళ్లగడ్డ అసెంబ్లీ ఎన్నికల అధికారి మల్లికార్జునరెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ అభ్యర్థి అఖిలప్రియ, వైసీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం కోసం 48 గంటలు ముందు అనుమతి తీసుకోవాలని, అసెంబ్లీ పరిధిలో ఇరువురు అభ్యర్థులు వేరువేరు తేదీలలో ప్రచారం చేసుకునేలా అనుమతి పొందాలన్నారు. వాహనాల అనుమతి, పోలింగ్ ఏజెంట్ల నియామకం, ఇఫ్తార్ విందు వాటి అనుమతి కోసం పోలీసు అధికారుల అనుమతి పొందాలన్నారు.

పరిశుభ్రతకు సహకరించండి

నంద్యాల, ఏప్రిల్ 5, ఆంధ్రజ్యోతి: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తులు క్షేత్రం పరిశుభ్రతకు సహకరించాలని మఠం సమాచార అధికారి సేతురామన్, అటవీ అధికారులు శుక్రవారం కోరారు. వారు నల్లమల అటవీ ప్రాంతంలోని దేవాలయాల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని సేకరించి ట్రాక్టర్లలో తరలించారు.

నేడు బడేరాత్

చాగలమర్రి, ఏప్రిల్ 5: రంజాన్ మాసంలో వచ్చే అతి ముఖ్యమైన పండుగ బడేరాత్. ఈ పండుగకు చాగలమర్రి గ్రామంలోని 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఖిల్లా, అరబ్, జామియా, పెద్దమకానం మసీదులను ముస్తాబు చేశారు. రంజాన్ మాసంలో చివరి శుక్రవారం కావడంతో ఆయా మసీదుల్లో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొని ప్రార్థనలు చేశారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి


బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోట్ల, నాయకులు

డోన్, ఏప్రిల్ 5: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ ఎంతగానో పోరాడారనీ ఈ సందర్భంగా కోట్ల కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, తాదూరు వెంకటరమణయ్య, వెంకటాపురం పెద్దయ్య, భూమా నాగన్న, శ్రీరాములు, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, రామిరెడ్డి పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంధం శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షులు ఉంగరానిగుండ్ల రాముడు, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పెద్ద రామచంద్రుడు పాల్గొన్నారు.

● పట్టణంలో న్యాయవాదుల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, డోన్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణప్రసాద్, కోశాధికారి మంగమూరి శ్రీను, సీనియర్ న్యాయవాది రామలింగయ్య, పులిదామోదర్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: బేతంచెర్లలో బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డోన్ టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, డోన్ టీడీపీ యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మలు డోన్-బనగానపల్లె సర్కిల్‌లో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భీమేశ్వరరెడ్డి, చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, సుధాకర్, రఘు, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, బుగ్గన మాధవిరెడ్డి, మురళి, కేవీ సుబ్బారెడ్డి, జగదీష్, మేకల నాగరాజు, శివరాం శివ, నాయకులు పాల్గొన్నారు.

చాగలమర్రి: బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం చాగలమర్రి బీసీ సంఘ కార్యాలయంలో ఆ సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లా నాగరాజు, దూదెకుల నూర్‌బాషా సంఘ మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవల గురించి కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనుంజయుడు, ఓబులేసు, నరేంద్ర, అబ్దుల్, ఓబయ్య, ఇమామ్‌బాషా, సమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: దళిత పక్షపాతి బాబు జగ్జీవన్‌రామ్ అని ఎమ్మార్పీఎస్ తాలుకా నాయకుడు ఓబులేసు అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని జంతర్ మంతర్ కాలనీలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పూలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సవారి, మహిళలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


చాగలమర్రి బీసీ సంఘం కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు


డోన్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



బేతంచెర్లలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు